క్లుప్తంగా

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

దెందులూరు: రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు గురువారం నుంచి సెలవులు ఇచ్చారు. ప్రభుత్వం వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకుని గురువారం నుంచి జూన్ 11వ తేదీ వరకు సెలవులను ప్రకటించిందని దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని కే.అన్నమ్మ తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ ఆదేశాల్లో అన్ని పాఠశాలల హెచ్ఎంలకు పంపడం జరిగిందన్నారు. ఏ పాఠశాలలోనైనా వేసవిలో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు.

విద్యతోనే అభివృద్ధి



గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పోతునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులతో పుస్తకాలు విజ్ఞానం అవగాహన అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విజ్ఞాన పుస్తకాలను కొంచెం సేపు వారితో చదివించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సువార్త సభలు

దెందులూరు: మార్పు, రక్షణ, లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలని యెరూషలేము మినిస్ట్రీస్ సిస్టర్ గ్రేస్ రాణి అన్నారు. దెందులూరు యందం వారి వీధిలో రక్షణ సువార్త సభలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి సువార్తికులు ఆ రీష్ జాన్ వెస్లీ, విలియమ్స్ బెంజిమెన్ విచ్చేశారు. దేవుని ఆజ్ఞలు అనుగుణంగా శాంతి సమాధానం లక్ష్యంగా సంఘాలు బలపడాలన్నారు. ఐకమత్యంతోనే ఏదైనా సాధ్యపడుతుందని వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు వారి జీవితంలో జరిగిన మేలులను వివరిస్తూ అద్భుత సాక్షాలను చెప్పారు.

డీపాల్ విద్యార్థుల ప్రతిభ

ద్వారకాతిరుమల: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో డీపాల్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థి మండల టాపర్‌గా నిలిచాడు. ద్వారకాతిరుమల మండలంలో మొత్తం 6 ప్రైవేట్ పాఠశాలల్లో 213 మంది పరీక్ష రాయగా, 186 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్‌లోని డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థిని ఎం సాయి పూజిత 590, కె.హర్ష వర్ధన్ 589, కె.సాయి చంద్ర శేఖర్ 587 మార్కులతో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ ఫాదర్ నెల్సన్ జాన్ తెలిపారు. ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆయన అభినందించారు.



ఎం సాయి పూజిత (590)



కె.హర్ష వర్ధన్ (589)



కె.సాయి చంద్ర శేఖర్ (587)

ఆత్మీయ కలయిక

దెందులూరు: తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం శ్రీరామవరం గ్రామానికి చెందిన నేత కొత్తపల్లి రోష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్‌ను సత్కరించేందుకు తీసుకువెళ్లిన పార్టీ కండువాను రోష్‌బాబు మెడలో వేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జగన్ సూచించారన్నారు.



జగన్‌ను కలిసిన రోష్‌బాబు

ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్సీ

ఉంగుటూరు: మండలంలోని బొమ్మిడి హైస్కూల్ పదవీవిరమణ చేసిన జయలలిత, నారాయణపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రసాద్‌లను ఆయా పాఠశాలలో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనం సీజ్

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం వద్ద కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఓ వాహనాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన భలే రాము అనే వ్యక్తి తన టాటా ఇంట్రా వెహికల్‌లో కోడి వ్యర్థాలను కురెళ్లగూడెంలోని గణేష్‌కు చెందిన ఆక్వా చెర్వుకు తరలిస్తున్నాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బంది కురెళ్లగూడెం వద్ద వాహనాన్ని పట్టుకున్నారు. కోడి వ్యర్థాల గల వాహనాన్ని సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

కూలీల కొరతతో వ్యవసాయం భారం

- వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్న రైతులు
- ఆ దిశగా అడుగులు వేయని కేంద్ర ప్రభుత్వం
- వ్యవసాయ పనులకు కూలీల కొరత



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దెందులూరు: రైతులకు ఏటా పెరుగుతున్న పెట్టుబడులు. ఉపాధి హామీ పథకాన్ని అనుసందానం చేస్తే రైతులకు మేలు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎప్పుడు అనుసంధానం చేస్తుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఏటా పెరుగుతున్న పెట్టుబడులకు తోడు కూలీల కొరతతో వ్యవసాయం రైతులకు పెనుభారంగా మారింది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు సాగు పెట్టుబడి కూడా తగ్గుతుందని రైతులు అంటున్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా రైతుల నుంచి ఈ డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

కూలీల కొరత తీవ్రం

కూలీలు ఎక్కువగా ఉపాధి పనులకు వెళుతుండడంతో వ్యవసాయ పనులకు వారి కొరత ఏర్పడుతోంది. దీంతో కూలీ రేట్లు పెరగడంతో పాటు సకాలంలో వ్యవసాయ పనులు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దెందులూరు నియోజవర్గంలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 30,500ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. అలాగే మొక్కజొన్న, వేరుశనగ, మిరప,బొప్పాయి, తదితర పంటలను 11వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు ఎకరానికి రూ.25వేలపైన పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయం యంత్ర పరికారాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని మనుషులే చేయాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో కూలీలకు భోజనం పెడుతూ రోజుకు రూ.600 ఇవ్వాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. దెందులురు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం వచ్చినప్పటి నుంచి ప్రధానంగా చెరువు పనులే చేయిస్తున్నారు. ఈ పథకాన్ని వ్యవసాయనికి అనుసంధానం చేస్తే కూలీల కొరత తీరుతుంది. పొలం పనులకు అయ్యే ఖర్చులో 50శాతం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. ఇలా చేయడం వల్ల సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోనేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తారని ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం. పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం చాలా కష్టంగా మారింది. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతుకు కొంత వరకు మేలు జరుగుతుంది.

రైతులను ఆదుకోవాలి



ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ పంట చేతికి వచ్చేంత వరకు నమ్మలేకపోతున్నాం. అతివృష్టి, అనావృష్టి చీడీపీడల వల్ల నష్టపోతున్నాం. కూలీల ఖర్చు పెరిగిపోయింది. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలి.

– పర్వతనేని నరేంద్రబాబు, రైతు

నేడు దివ్యాంగ విద్యార్థులకు పరికరాల పంపిణీ

నిడమర్రు: మండలంలోని దివ్యాంగ విద్యార్థులకు గురువారం ఉదయం 8.30 గంటలకు స్థానిక గాదిరాజు గోపాలకృష్ణంరాజు జెడ్పీస్కూల్లో నిర్వహించే కార్యక్రమంలో పరికరాల పంపిణీ ఉంటుందని ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొంటారన్నారు.

దొంగతనం కేసులో ముద్దాయికి జైలు శిక్ష

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో గంగానమ్మ గుడిలో దొంగతనం కేసులో నేరం రుజువైనందున ముద్దాయి ఆకుల మహేష్‌కు ఐదు నెలల జైలు శిక్షతో పాటు రూ.500లు జరిమానా విధించినట్లు బుధవారం భీమడోలు కోర్టు మేజిస్ట్రేట్ టీఎఎస్ఎస్ ఆర్ ఆదిత్య రిషిక్ తీర్పు ఇచ్చారు. గత ఏడాది నవంబర్ 13వ తేదీన గుండుగొలను గ్రామంలోని గంగానమ్మ గుడిలో దొంగతనం జరిగినట్లు మాండి నాగవెంకట గంగాధర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ యూజే విల్సన్‌ల పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించారు. జరిమానా కట్టని పక్షంలో మరో నెల సాధారణ జైలు శిక్షను అనుభవించాలని తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్, సీఐ యూజే విల్సన్, కోర్టు కానిస్టేబుల్ ప్రకాష్‌లను ఎస్పీ కె.ప్రతాప్ కిషోర్ అభినందించారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కే. తేజస్వి (559మార్కులు)



చల్లారి రమ్యశ్రీ (557



జ్యోతిష్యం లోహిత్ (556



పీఎస్ఎస్ మణికంఠ, హైస్కూల్ విద్యార్థి



కేఎస్ఎస్ ప్రణీత, హైస్కూల్ విద్యార్థి



యు.లికిత హైస్కూల్ విద్యార్థి



నీహారిక, పెదపాడు



టీ మహాలక్ష్మి, వట్లూరు

దెందులూరు: పదో తరగతి పరీక్షల్లో దెందులూరు మండలం 64. 59 శాతం ఉత్తీర్ణత సాధించారని దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని కే. అన్నమ్మ అన్నారు. బుధవారం దెందులూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మాట్లాడారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన కే తేజస్వి 559 మార్కులు సాధించినట్లు తెలిపారు. మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని చల్లారి రమ్యశ్రీ 557 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచింది. కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థి చెడ్డ జ్యోతిష్యం లోహిత్ 556 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను దెందులూరు మండల విద్యాశాఖ అధికారులు కే.అన్నమ్మ, ఏవీఎస్‌వీ ప్రసాద్, గోపన్నపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కే మనోహర్, మేధిరావుపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.హరిసీతారామయ్య, కొవ్వలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీఎస్ఎల్‌వీఎస్ శర్మలు ప్రత్యేకంగా అభినందించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో దెందులూరు మండలం గంగన్నగూడెం శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విజయదుందుభి మోగించింది. బుధవారం సాయంత్రం హైస్కూల్లో పాఠశాల కరస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీఎస్ఎస్ మణికంఠ 580లతో ప్రథమ స్థానం, కె ఎస్ ఎస్ ప్రణీత 573 మార్కులతో ద్వితీయ స్థానం, యు లికిత 571 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. మండల టాపర్‌తో పాటు మరో రెండు మెరిట్ మార్కులు సొంతం చేసుకున్న విద్యార్థులు తమ హైస్కూల్ విద్యార్థులు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విజయం సాధించిన విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఉపాధ్యాయులను తల్లిదండ్రులను విద్యార్థులను కరస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మండలంలో సత్తా చాటిన బాలికలు

పెదపాడు: మండలంలోని పది పరీక్షా ఫలితాల్లో బాలికలు తమ సత్తా చాటి మొదటి నాలుగు స్థానాలు వారే సాధించారు. వీరమ్మకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కలిపిండి నీహారిక 584మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. వట్లూరులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థిని టీ మహాలక్ష్మి 563మార్కులతో ద్వితీయ స్థానం, వట్లూరు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థి కె శృతి 558 మార్కులు, వీరమ్మకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె కృప 558 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. దీంతో వారిని పెదపాడు ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీరమణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పెదపాడులో 72శాతం ఉత్తీర్ణత

పెదపాడు: పది పరీక్షా ఫలితాల్లో మండలంలో 72శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పెదపాడు మండల ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణలు తెలిపారు. పెదపాడు మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లోను, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, ఒక ఎయిడెడ్ పాఠశాలలోను మొత్తం 543 మంది విద్యార్థులకు గాను 391 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సుందర్‌బాబు సేవలు అభినందనీయం

భీమడోలు: ఎంటీఎస్ టీచర్ సుందర్‌బాబు సేవలు అభినందనీయమని భీమడోలు ఎంఈవో 1, 2లు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ కుమార్‌లు అన్నారు. గుండుగొలను పంచాయతీ శివారు భోగాపురంలో 1998 ఎంటీఎస్ టీచర్‌గా పని చేస్తున్న సుందర్‌బాబు ఈనెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో భీమడోలు ఎంఈవో కార్యాలయంలో పాఠశాల చివరి పని రోజైన బుధవారం ఆయనను ఎంఈవోలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని నిబద్ధతతో అంకితభావంతో పని చేసిన సుందర్‌బాబు సేవలు ప్రశంసనీయమన్నారు. భోగాపురం పాఠశాలలో సింగిల్ ఉపాధ్యాయుడుగా పని చేస్తూ సెలవులను వినియోగించుకోకుండా విద్యా సంవత్సరమంతా విద్యార్థులకు చక్కని విద్యాబోధన అందజేశారన్నారు. బోధనా కార్యక్రమాలు, బోధనేతర కార్యక్రమాల్లోను చురుగ్గా పని చేసారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ టీచర్లు, పీఆర్‌టీయు నాయకులు ఎం.శరీన్, ఎస్‌వీఎల్‌బి శర్మ పాల్గొన్నారు.



సుందర్‌బాబును సత్కరిస్తున్న ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు

సెంట్రల్ జీఎస్టీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా భావన వశిష్ట

దెందులూరు: సెంట్రల్ జీఎస్టీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా దెందులూరు గ్రామానికి చెందిన భావన వశిష్ట ఎంపికయ్యారు. ఎస్ఎస్‌సీసీఎల్ పరీక్షల్లో ఆల్ ఇండియాలో 5,455 ర్యాంకు సాధించడంతో ఆమె సెంట్రల్ జీఎస్టీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు గంజి వెంకట గిరిధర్ శ్యామ్, ప్రసన్నరాణి సంతోషం వ్యక్తం చేశారు. దెందులూరులో భావన వశిష్ట కుటుంబ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు.

నవధాన్యాలతో ఎన్నో ఉపయోగాలు

పెదవేగి : నవధాన్యాల సాగుతో ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ చందు సత్తిబాబు అన్నారు. పెదవేగి మండలం కొప్పాక యూనిట్ బుధవారం పినకడిమి వంగూరు గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై నవధాన్యాలు మెండుగా వేయాలని పకృతి వ్యవసాయం నవధాన్యాల గురించి రైతులకు వివరించారు. నవధాన్యాలు వేయటం వలన భూమి సారవంతం అవుతుందని, తేమ శాతం ఎక్కువ రోజులు ఆగుతుందని పురుగులు తెగుళ్ల తగ్గుతాయని దిగుబడి పెరగడమే కాకుండా అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని వివరించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది సర్కారు బడులు

భీమడోలు: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలు అని భీమడోలు ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు గ్రామంలో బుధవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులచే ప్రదర్శింపబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హెచ్ఎం పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎంఈవోలు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరికి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల వైపు విద్యార్థులు మరలకుండా ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో వెళ్లి ప్రభుత్వ బడుల్లో చేర్పాలన్నారు. వేసవి సెలవుల్లో తరచుగా పాఠశాలను సందర్శించాలని, ఆకతాయిలుపై నిఘా ఉంచాలన్నారు. వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీవీలు, సెల్‌ఫోన్లుకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ మండే సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ షీమా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాతూరు పాఠశాల వార్షికోత్సవంలో చిన్నారులతో గ్రూప్ ఫోటో దిగిన ఎంఈవోలు, టీచర్లు

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులు

పెదవేగి : రోమన్ క్యాథలిక్ అత్యున్నత మతగురువు పోప్ ఫ్రాన్సిస్ మరణానికి ఏలూరు పీఠాధిపతి బిసప్ పొలిమేర జయరావు ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. బుధవారం పోప్ ఫ్రాన్సిస్ చిత్ర పటం వద్ద వివిధ రకాల పుష్పాలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా పాప్ ఫ్రాన్సిస్ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. అధ్యాత్మిక నాయకత్వంలో తరతరాలకు ప్రాప్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సెయింత దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి బాల, ఫాదర్ బాబు జార్జ్, కోశాధికారి ఫాదర్ బి రాజు , సోషల్ సర్వీస్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్ ,కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్, తోట అంతోని, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజులు పాల్గొన్నారు.



పోప్ ప్రాన్సిస్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న బిషప్ పొలిమేర జయరావు, తదితరులు

పది ఫలితాల్లో బాలికలదే హవా



దోనే తనుశ్రీ

భీమడోలు: టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల బాలికలు సత్తా చాటారు. మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సరాసరిన 70శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా సరాసరిన 74శాతం ఉత్తీర్ణతను పొంది తమ ప్రతిభను చాటారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన దోనే తనూశ్రీ(575) మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. భీమడోలు ఉన్నత పాఠశాలకు చెందిన పి.స్నేహ గీతిక(565) మార్కులతో ద్వితీయ స్థానాన్ని, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినీ వి.వినీలా(565)లు మార్కులు సాధించింది. అదే పాఠశాలకు చెందిన జి.శరణ్య(560) మార్కులు పొంది మండల తృతీయ స్థానాన్ని సాధించి తమ సత్తా చాటారని భీమడోలు ఎంఈవో 1, 2లు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు బుధవారం తెలిపారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 172 మందికి కాగా 112 మంది పాసై 65 శాతం ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. కురెళ్లగూడెం ఉన్నత పాఠశాలలో 12 మందిలో 10 మంది పాసై 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆగడాలలంక ఓరియంటల్ పాఠశాలలో 29 మందికి గాను 23 మంది పాసై 79శాతం ఉత్తీర్ణతను సాధించారు. పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 92 మందిలో 77 మంది పాసై 84శాతం ఉత్తీర్ణత సాధించారు. పాలేటి ఇంగ్లీషు మీడియం పాఠశాలలోని 36 మందికి గాను 32మంది పాసై 89 శాతం సాధించారు. గుండుగొలనులోని శ్రీవిద్యాలయ స్కూలుకు చెందిన 72 మందికి గాను 71 మంది పాసై 99.3శాతం ఉత్తీర్ణత సాధించాని ప్రిన్సిపల్ గేదెల సురేష్‌కుమార్ తెలిపారు. బి.రామ్‌చరణ్ సంజయ్(589) మార్కులు, ఎస్.మోహన్‌సాయి(588) మార్కు లు పొందారు. చైతన్య ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన 35 మందికి గాను 35 పాసై నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా ఏ.ప్రణవిచౌదరి(594) మార్కులతో నిలిచింది. 585 మార్కులను బి.స్నేహప్రియ,ఏ.కావ్య సాహి తీలు సాధించారని ఎంఈవోలు తెలిపారు.



దివ్యను అభినందిస్తున్న పత్తేపురం ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

గణపవరంలో 85 శాతం ఉత్తీర్ణత

గణపవరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. మండలంలో మొత్తం ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 484 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాయగా 404 మంది ఉత్తీర్ణులై 85.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో గొర్రెల బాలయ్య తెలిపారు. గణపవరం బాలికొన్నత పాఠశాలకు చెందిన పిల్లా పూజిత 573 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో మండలం స్థాయిలో ప్రథమ స్థానం, గణపవరం గరల్స్ హైస్కూలు విద్యార్థిని పోతల మౌనిక 571 మార్కులు, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పెరవలి రాంచరణ్ 571 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. డి.కుముదవల్లి హైస్కూల్‌కు చెందిన ఎల్ఎంవి మణితేజ 570 మార్కులు సాధించి మండల స్థాయి తృతీయ స్థానాలలో నిలిచారు.

నియోజకవర్గంలో ప్రథమ స్థానం: గణపవరంలోని విద్యాజ్యోతి మెరిట్ హైస్కూలు విద్యార్థి ఎస్.రామశివ 591 మార్కులు సాధించి ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇదే పాఠశాలనుంచి సిహెచ్ సంతోష్ 588 మార్కులు సాధించగా, 500 పైబడిన మార్కులు సాధించినవారు 30 మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపల్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. పిప్పర పబ్లిక్ స్కూలు విద్యార్థి గనిశెట్టి హారిక 588 మార్కులు, సరిపల్లె ఇండియన్ డిజిటల్ స్కూలు విద్యార్థిని కె.సత్యగోవింద మహేశ్వరి 572 మార్కులు సాధించాడు. ప్రైవేటు పాఠశాలల్లో 68.9శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

నిడమర్రులో 61 శాతం ఉత్తీర్ణత

నిడమర్రు: పదోతరగతి -2025 ఫలితాల్లో నిడమర్రు మండలంలో 61శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు భాస్కర్, శ్రీనివాస్‌లు తెలిపారు. మండలంలోని 359 మంది పరీక్షలు రాయగా 219 మంది ఉత్తీర్ణులు అయ్యారు. పత్తేపురం స్కూల్ విద్యార్థిని 554 మార్కులతో మండలం టాపర్‌గా, 553 మార్కులతో రెండో స్థానంలో పెదనింద్రకొలను జెడ్పీస్కూల్ విద్యార్థిని నిమ్మల పావని నిలిచింది. మండలంలోని 7 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 311 మంది పరీక్షలు రాయగా 176 మంది పాస్‌తో 56 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధిస్తే, మండలంలోని రెండు ప్రైవేటు స్కూల్స్ నుంచి 48 మంది టెన్త్ పరీక్షలు రాస్తే 43 మంది పాస్‌తో 90శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నట్లు ఎంఈవోలు తెలిపారు. పత్తేపురం జెడ్పీస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రైవేటు, ప్రభుత్వ స్కూల్స్‌లో టాపర్‌గా నిలిచిన కె. దివ్యను పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉంగుటూరులో బాలికల ప్రతిభ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో పదో తరగతిలో 706మంది విద్యార్థులకు గాను 462 మంది ఉత్తీర్ణులయ్యారు. 65శాతం ఫలితాలు సాధించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో బాదంపూడి హైస్కూల్‌కి చెందిన జశ్వంత్ 580 మార్కులు సాధించి మండలంలో ఫస్ట్‌గా నిలిచాడు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవాలు

ఉంగుటూరు: పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరగడానికి దోహదపడతాయని పలువురు వక్తలు తెలిపారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ఉంగుటూరు నెం1 పాఠశాలలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కైకరం హైస్కూలులో జరిగిన వార్షికోత్సవానికి అధ్యక్షత వహించిన హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాల ఏడాది కాలంగా సాధించిన ప్రగతి వివరించారు. టి.రమేష్, ఎం. వేణుగోపాల్, ఎం. వి కృష్ణారావు, వెలమల శ్రీనివాసరావు, కూనా అప్పారావు, సర్పంచి సలగల గోపి, ఎస్ ఎం సి చైర్మెన్ జగదీశ్వరి, మాజీ జెడ్పీటీసీ చింతలవాసు, చెన్ను సత్యవేణి, ఎగ్గిన శ్యామలాదేవి, బాలాజి వీర్రాజులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు.

